




Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 22 | సోమవారం 31 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# ఫెర్రీ బోల్తా.. ఏడుగురు మృతి

## - ఉత్తర సైప్రస్ తీరంలో ఘటన



**టర్కీ - సూర్య వాస్తవం**

ఉత్తర సైప్రస్ తీరంలో సుమారు 270 మంది ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న ఫెర్రీ ఆదివారం బోల్తా పడింది. దీంతో ఏడుగురు మరణించారు. 237 మందిని రక్షించామని, మరో 24 మంది కోసం రక్షణ విభాగాలు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ప్రధాన మంత్రి ఉనాల్ ఉస్టెల్ తెలిపారు. ఫెర్రీ బయలుదేరిన 15 నిమిషాలకే ప్రతికూల వాతావరణంతో నీరు లోపలికి రావడం ప్రారంభించిందని పేర్కొన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే సహాయం కోసం పిలుపు అందిందని ఆయన చెప్పారు. సైప్రస్ ఉత్తర ప్రాంతంలో ఉన్న గిర్నే అని కూడా పిలువబడే కైరేనియా ఓడరేవు నుంచి, మెర్సిన్ ప్రావిన్స్‌లోని టర్కీ ఓడరేవు అయిన టాసుకుకు ఒక కాటమరాన్

- మిగతా 2లో..

# 30 రోజులు వీసా ఫ్రీ

- భారత పౌరులకు ఉజ్బెకిస్థాన్ ఆఫర్
- ఆ దేశాధ్యక్షుడు మిర్జియోయెవ్ కానుక
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీ
- కీలక ఒప్పందాలపై సంతకాలు
- 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం



**తాష్కెంట్ - సూర్య వాస్తవం**

భారతీయ పౌరుల కోసం ఉజ్బెకిస్థాన్ నెలపాటు (30 రోజులు) వీసా రహిత విధానాన్ని ప్రకటించింది. తద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య, పర్యాటక సంబంధాలు బలపడతాయని ఆకాంక్షించింది. మధ్య ఆసియా పర్యటనలో భాగంగా శనివారం భారత ప్రధాని మోదీ తాష్కెంట్‌లో ఆ దేశాధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలపై సుదీర్ఘంగా చర్చించారు.

పెట్టుబడులు, ఆవిష్కరణలు, రక్షణ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. పరస్పరం దీర్ఘకాలిక యురేనియం సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నారు.

- మిగతా 2లో..



# పరీక్ష కేంద్రానికి విద్యుత్ అంతరాయం.. నీట్-పీజీ రద్దు

**రాజస్థాన్ - సూర్య వాస్తవం**

రాజస్థాన్ జైపూర్ లో నీట్-పీజీ రద్దు అయింది. ఈ మేరకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీా) వర్గాలు తెలిపాయి. జైపూర్‌లో ఐఓఎన్ డిజిటల్ జోన్ సితాపుర-2 పరీక్షా కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ కేంద్రానికి కేటాయించబడిన అభ్యర్థులందరికీ వచ్చే నెల సెప్టెంబర్ 5న పరీక్ష

- మిగతా 2లో..

# నేపాల్‌లో మృత్యు ఘోష!

- 788కి చేరిన మృతుల సంఖ్య
- ఇంకా 2,500 మందికిపైగా గల్లంతు
- రోజుకో వంద మృతదేహాలకు పైగా లభ్యం
- తొలగని బురద.. దొరకని యాత్రికుల ఆచూకీ
- తప్పిపోయిన వారి కోసం ఆరో రోజూ రెస్క్యూ
- రేయింబవళ్లూ ముమ్మరంగా సహాయక చర్యలు
- మళ్లీ విరుగుతున్న కొండచరియలు, కురుస్తున్న వర్షాలు
- ఉరుముతున్న భోటేకోశి, త్రిశూలి నదులు
- ఆయా ప్రాంతాల్లో హైలర్ట్ ప్రకటించిన ఎన్డీఆర్ఆర్ఎంఏ

హిమాలయ సరిహద్దు ప్రాంతం నుంచి దక్షిణంగా ప్రవహించే భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగిందని ఎన్డీఆర్ఆర్ఎంఏ ఒక ప్రకట నలో హెచ్చరించింది. 'వరదలతో నిండిన భోటేకోశి నదిలో నీటిమట్టం పెరిగింది. సంబంధిత వర్గాలన్నీ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవా లని కోరుతున్నాం' అని పేర్కొంది. అలాగే త్రిశూలి నదిలో కూడా నీటి మట్టం పెరగడంతో కుషీనగర్‌లో వరద ముప్పు పెరిగింది. అప్రమ త్తమైన జిల్లా యంత్రాంగం, గండక్ నది వెంబడి ఉన్న సున్నితమైన ప్రాంతాలను 'హై అలర్ట్' జారీ చేశారు. ప్రజలు వదంతులను నమ్మవ ద్దని, యంత్రాంగం సూచనలను పాటించాలని జిల్లా మేజిస్ట్రేట్ మహేంద్ర సింగ్ తన్వార్, ఎస్పీ కేశవ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. దేశంలో మళ్లీ కొండచర్యలు విరిగిపడుతున్నాయని, మళ్లీ ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని నేపాల్ వాతావరణ శాఖ హెచ్చరించింది.



**ఖాఠ్మాండు - సూర్య వాస్తవం**

నేపాల్‌లో ఇంకా మృత్యు ఘోష వెంటాడుతోంది. చిన్నాభిన్నమైన ఇళ్లు, ప్రాజెక్టులు, వంతెన లు, రోడ్లపై పేరుకు పోయిన బురదలో కూరుకు పోయిన శవాల కోసం ఆర్తనాదాలు మిన్నంటు తున్నాయి. తమ వారు బతికున్నారో, మృతిచెందారో, ఎక్కడ చిక్కుకున్నారో తెలియక తరలివచ్చిన ప్రజల తల్లడిల్లుతున్నారు. మరోపక్క మృతుల సంఖ్య ఆదివారం నాటికి 788కి చేరింది. గత ఆరు రోజులుగా కొనసాగుతన్న రెస్క్యూ ఆపరేషన్ వల్ల రోజుకో వంద మృతదేహాలకు పైగా లభ్యమవుతున్నాయి. ఇంకా 2,500 మందికి పైగా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో 537 మందికి పైగా ఆచూకీ దొరకడం లేదు. వారం రోజులవు తున్నా.. ఇంకా బురద తొలగకపో వడంతో యాత్రికుల ఆచూకీ దొరకడం లేదు. గల్లంతైన వారి కోసం తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య 20 వేల భద్రతా సిబ్బందితో వరద ప్రభావిత ప్రాంతాల్లో, సొరంగాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా రేయింబవళ్లూ కొనసాగు తున్నాయి.

మరోపక్క భోటేకోశి నదిలో మళ్లీ నీటిమట్టం పెరుగుతుండడం, త్రిశూలి నది ఉప్పొంగుతుండడం, మళ్లీ కొండచరి యలు విరుగుతుండడం, వర్షాలు కురుస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో హైలర్ట్ ప్రకటించారు. మళ్లీ వరద ముప్పు ఉందని, ప్రజలు, రెస్క్యూ సిబ్బందితో సహా అందరూ అప్రమత్తంగా ఉండాల ని జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ అథారిటీ

- మిగతా 2లో..



# బెంగళూరు కన్నా మైసూరు మెరుగైన ప్రణాళికాబద్ధమైన నగరం

## - సీఎం డీకే శివకుమార్

**మైసూరు - సూర్య వాస్తవం**

"బెంగళూరుతో పోలిస్తే, సాంస్కృతిక నగరమైన మైసూరు మరింత వ్యవస్థీకృతమైన, ప్రణాళికాబద్ధ మైన నగరం," అని ముఖ్యమంత్రి, బెంగళూరు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డి.కె. శివకుమార్ అన్నారు. శనివారం మైసూరులోని ఓవల్ గ్రౌండ్ లో డాక్టర్ శ్రీ శివరాత్రి రాజేంద్ర మహాస్వామిజీ 111వ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మీడియాతో మాట్లాడుతూ, బెంగళూరులో పెరుగుతున్న జనాభా ఒత్తిడి, ట్రాఫిక్ రద్దీ మరియు మౌలిక సదుపాయాలపై ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో కర్ణాటకలోని ఐదు ప్రధాన నగరాలకు కొత్త రూపాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని శివకుమార్ తెలిపారు. బెంగళూరుతో పాటు మైసూరు, బెల్గాం, హుబ్బళ్లి-ధార్వాడ్, కలబురగి నగరాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించబడతాయి. ఉపాధి కల్పన, విద్య, ఆరోగ్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ట్రాఫిక్ రద్దీని

- మిగతా 2లో..




# కులానికో యూనిక్ కోడ్ ఇవ్వాలి

- అప్పటిదాకా కులగణన వాయిదా వేయాలి
- కాదని గణన కొనసాగిస్తే 12,800 కోట్ల ప్రజాధనం వృథా
- దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరిక
- న్యూ ఢిల్లీ జాతీయ సదస్సులో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ చైర్మన్ టి. చిరంజీవులు డిమాండ్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించ కుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ పద్ధతి కాదని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక కాలమ్ ఉన్నట్లు గానే, ఓబీసీలకు ప్రత్యేక కాలమ్,

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

- నేడు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం: సీఎం చంద్రబాబు ట్వీట్
- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం

**అమరావతి- సూర్య వాస్తవం**

మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు

- మిగతా 2లో..



# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

- నేడు ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్
- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు

**అమరావతి- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి

- మిగతా 2లో..



# 30 రోజులు వీసా ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఒప్పందం ద్వారా భారత్ అణు శక్తి ప్రణాళికలు మరింత బలపడను న్నాయి. భవిష్యత్తులో ఇంధన భద్రతకు ఒప్పందం ఎంతగానో దోహదపడుతుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం గతేడాది 100 కోట్ల డాలర్లు దాటింది. చరిత్రలో ఈ మైలురాయిని చేరుకోవడం ఇదే తొలిసారి. వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించుకుని 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని అధిగమించాలనే లక్ష్యంతో ఇరు దేశాలు ముందుకు వెళ్లనున్నాయి. మరోవైపు, పట్టణాభివృద్ధి రంగంలో గుజరాత్ గిఫ్ట్ సిటీ నమూనాను అధ్యయనం చేసేందుకు ఉజ్బెకిస్థాన్ ప్రతినిధులు సిద్ధమయ్యారు. భేటీ అనంతరం మోదీ ఉజ్బెకిస్థాన్ విదేశీ ప్రతినిధులకు అందించే 'ఒలియ్ దరాజాలి దోస్లిక్' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పర్యటన ముగిసిన తరువాత మోదీ కిర్గిజిస్తాన్ చేరుకున్నారు. ఆదివారం బిష్కెక్ నగరంలో జరుగనున్న ఎస్సీఓ సదస్సుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

# ఫెర్రీ బోల్తా.. ఏడుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

తరహా ఫెర్రీ ప్రయాణిస్తోంది. డెనిజ్బిలిక్ ఫెర్రీ కంపెనీకి చెందిన ఈ నౌక ఫిలో, సైప్రస్ ఉత్తర తీరంలోని డయానా బీచ్ సమీపంలో మునిగిపోయిందని కైరేనియా మేయర్ మురత్ సెంకుల్ తెలిపారు. తీరం నుంచి సుమారు 7.5 కిలోమీటర్ల (4 నాటికల్ మైళ్ల) దూరంలో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు.

## పరీక్ష కేంద్రానికి విద్యుత్ అంతరాయం..

# నీట్-పీజీ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. సదురు కేంద్రంలో దాదాపు 300 మంది అభ్యర్థులకు రీ ఎగ్జామ్ కు హాజరు కావాల్సి ఉంది. ఆదివారం దేశవ్యాప్తంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పీజీ- 2026 పరీక్ష ప్రారంభమైంది. ఈ పరీక్షను ఎన్‌బిఇఎంఎస్ (చీదీజుమీ) కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒకే షిఫ్ట్‌లో నిర్వహించారు. పలు నగరాల్లోని ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు తరలివచ్చారు. దాదాపు 2.73 లక్షలకు పైగా వైద్య విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు.

# కులానికో యూనిక్ కోడ్ ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అలాగే జనరల్ వర్గాలకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా యూనిక్ కోడ్ ఇచ్చిన తర్వాత మాత్రమే జనగణన చేపట్టాలని బీసీ ఇంటెలెక్టువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాండ్ చేశారు. ఆదివారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చిరంజీవులు అధ్యక్షతన జనగణనలో ప్రతికులానికి యూనికోడ్ ఉండాలనే డి మాండ్‌తో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెం ట్స్ అసోసియేషన్ తరఫున గౌడ కిరణ్ కుమార్ సమన్వయం వహించారు. ఈ సదస్సులో మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, అనిల్ జైహింద్ (చైర్మన్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం), విల్సన్ (రాజ్యసభ సభ్యుడు, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్ కన్వీనర్), డాక్టర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ (స్వరాజ్ ఇండియా), ప్రొఫెసర్ రతన్ లాల్, బాల్‌రాజ్ గౌడ్ , సుగురు దుర్గయ్య గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశవ్యాప్త ఏకాభిప్రాయం ఏర్పడేవరకు కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రక్రియను నిలిపివేయాలని లేకుండా ఇందుకు అయ్యే ఖర్చు రూ. 12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు. గణన కొనసాగిస్తే దేశవ్యాప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

**బీసీ సెన్సస్‌ను కాంగ్రెస్, బీజేపీ ఆచరించడం లేదు: శ్రీనివాస్‌గౌడ్**

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయం, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మెజార్టీ వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. జనాభాపై రాహుల్‌గాంధీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సెన్సస్ బీసీ జనగణనను బీజేపీ ఆచరించడం లేదని ఆరోపించారు. ఇందుకు రాజ్యాంగ సవరణ చేస్తే న్యాయపరంగా కూడా ఇబ్బందులు ఎదురుకావన్నారు. ప్రతికులానికి నెంబరింగ్ ఇవ్వకుండా న్యాయం ఎలా చేస్తారని కాంగ్రెస్, బీజేపీలను నిలదీశారు. అసలు లెక్కలు తేలితే వీరి పునాదులు కదులుతాయని భయపడుతున్నారా? అని నిలదీశారు. బ్యాంకులను ఎగ్గొట్టిన, మోసం చేసిన వారిలో బీసీలు లేరని ఈ రెండు పార్టీలు బీసీల గొంతుకోస్తున్నాయని విమర్శించారు. దేశంలో 80 కోట్లకుపైగా ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో జనాభాకు అనుగుణంగా వాటా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ మాటలకు పరిమితం కాకుండా ఓబీసీలకు మద్దతుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని,ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన బాట పడతామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

(మొదటిపేజీ తరువాయి)

మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. నేటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# నేపాల్‌లో మృత్యు ఘోష!

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్డీఆర్ఆర్ఎంఏ) కోరింది. ఈ నెల 26న నేపాల్‌లో ఆకస్మిక వరదలు సంభ వించి, దేశాన్ని అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. నేపాల్‌లో విపత్తు తర్వాత 320 మంది విదేశీయులతో సహా మొత్తం 2,502 మంది గల్లంతయ్యారు. ఇందులో 275 మందికి పైగా భారతీయులు, 128 మంది భారత సంతతికి చెందిన వారి ఆచూకీ తెలియకుండా పోయింది. మరో 108 మందిని రక్షించారని న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. నేపాల్ విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రాథమిక సమాచారం ప్రకారం, గల్లంతైన వారిలో వరద ప్రభావిత మూడు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన 238 మంది విద్యార్థులు, 18 మంది ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. వరద ప్రభావిత రసువా, నువాకోట్ జిల్లాల్లోని తొమ్మిది జలవిద్యుత్ ప్రాజెక్టులలో 537 మంది కార్మికులు, ఉద్యోగుల ఆచూకీ గల్లంతైంది. ఈ ప్రాజెక్టులలో 898 మంది కార్మికులు, ఉద్యోగులతో సంబంధాలు తెగిపోయిన ట్లు ప్రాథమికంగా పేర్కొంది. వారిలో 361 మందిని రక్షించగా, 537 మంది ఆచూకీ ఇంకా తెలియలేదు.



చైనా వైపు కూడా 16 మంది మరణించగా, 546 మంది గల్లంత య్యారు. అక్కడ సహాయక చర్యలు పూర్తి వేగంతో కొనసాగుతున్నాయి. టిబెట్‌లో గల్లంతైన వారిలో 23 దేశాలకు చెందిన 261 మంది విదేశీయులు ఉన్నారు. వీరిలో 49 మంది భారతీయులు కూడా ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరకు, ఒక్క చిటవాన్ జిల్లా నుంచే 264 మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆ తర్వాత తూర్పు నవల్పరాసి లో 194, పశ్చిమ నవల్పరాసిలో 100 మృతదేహాలు లభించాయి. గోర్ఖా, ధాడింగ్, నువాకోట్, తనాహు, రసువా అనే మరో ఐదు జిల్లాల నుంచి కూడా మరిన్ని మృతదేహా లు లభించాయని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాలలో కేవలం 17 మాత్రమే గుర్తించామని, చట్టపరమైన ప్రక్రియ లు పూర్తి చేసిన తర్వాత ఇప్పటివరకు 96 మృతదేహాలకు అంత్య క్రియలు నిర్వహించినట్లు భాగమతి ప్రావిన్స్ పోలీస్ కార్యాలయ ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్ ధమాలా చెప్పారు. ఖననానికి ముందు మృతదేహాల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి భద్రపరిచామని చెప్పారు.

భారత్ నుంచి 18 మంది ఫోరెన్సిక్ నిపుణుల బృందం నేపాల్‌కు చేరుకుందని నేపాల్ అధికారి స్పష్టం చేశారు. తమ బంధువుల కోసం వెతుకుతున్న ప్రజలు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో నేపాల్ ఆసుపత్రులలో తమతమ వారి మృతదేహాలే వని వెతుకుతూ.. కన్నీటిపర్యంతం అవుతున్నారు.

**20 వేల మంది భద్రతా సిబ్బందితో ఆపరేషన్**

నేపాల్ ప్రభుత్వం గాలింపు, సహాయక చర్యల కోసం దాదాపు 20,000 మంది భద్ర తా సిబ్బందిని మోహరించింది. మరోవైపు చిక్కుకు పోయిన ప్రజలను సురక్షిత ప్రాంతాల కు తరలించడానికి హెలికాప్టర్లు పదేపదే గస్తీ కాస్తున్నాయి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, కఠినమైన భూభాగం, ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.

దీంతో నేపాల్.. భారతదేశం, చైనా, ఇతర దేశాల నుంచి ప్రత్యేక సహాయం కోరింది. సహాయక బృందాలు రేయింబవళ్లు పనిచేస్తున్నాయని, సొరంగం వద్ద ఆపరేషన్లు ఒక కీలకమైన పురోగతికి చేరాయని సైనిక అధికారులు తెలిపారు.

## బెంగళూరు కన్నా మైసూరు మెరుగైన

# ప్రణాళికాబద్ధమైన నగరం

(మొదటిపేజీ తరువాయి)

తగ్గించడానికి అనేక చిన్న, పెద్ద నగరాలకు ప్రత్యేక రింగ్ రోడ్లు ఇప్పటికే ఆమోదించబడ్డాయని ఆయన అన్నారు. బెంగళూరు కంటే మైసూరు మెరుగైన ప్రణాళికాబద్ధమైన నగరమని ఆయన అన్నారు. ఇక్కడ కొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

**'గ్రేటర్ మైసూర్' ప్రాజెక్ట్‌పై ప్రాధాన్యత**

కావేరీ నీటి సమస్య, ఉత్తర కర్ణాటక అభివృద్ధిపై దృష్టి సారించడం వల్ల, మైసూరుకు అవసరమైన శ్రద్ధ ఇవ్వలేకపోయారు. నేను ఉత్తర కర్ణాటక అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టాను. ఇప్పుడు మైసూరుపై కూడా దృష్టి సారిస్తాను. బెంగళూరు కంటే మైసూరు మెరుగైన ప్రణాళికలతో ఉంది, వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నగరాన్ని పరిరక్షించడం నా బాధ్యత. దాని భవిష్యత్తు కోసం నేను ఎన్నో ప్రణాళికలు రూపొందించాను. సిద్దరామయ్య 'గ్రేటర్ మైసూరు' ప్రాజెక్టును వాగ్దానం చేశారు. ఆ వాగ్దానాన్ని నెరవేర్చడం మన బాధ్యత," అని ఆయన అన్నారు. మైసూరు సమగ్ర అభివృద్ధి కోసం ప్రాజెక్టుపై చర్చించి, ఒక బ్లూప్రింట్ సిద్ధం చేసేందుకు త్వరలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా ఉత్సవానికి కొత్త రూపునిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. సైన్యం, వైమానిక దళం, ఇతర రక్షణ దళాలతో కూడిన పరేడ్ నిర్వహించాలనే ప్రతిపాదన ఉంది. దసరా వేడుకల కోసం సినీ ప్రముఖులను, వివిధ సాంస్కృతిక బృందాలను ఒకచోట చేర్చాలని కూడా ఆయన సూచించారు. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు ఈ ఊరేగింపులో పాల్గొంటారు. ఈసారి, ఒకే రంగానికి చెందిన జానపద కళాకారులు ఐదుగురికి మించి పాల్గొనరాదు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఊరేగింపు స్వరూపాన్ని మార్చాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దసరా సమ యంలో కంబళ నిర్వహించాలనే ప్రతిపాదన గురించి మాట్లాడుతూ, అది ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని, ఇంకా చర్చలో ఉందని ఆయన అన్నారు. నేను కంబాల సంస్థ గురించి ఇంకా చర్చిస్తున్నాను. అది పర్యావరణానికి హాని చేస్తుందన్నది కేవలం ఒక సాకు మాత్రమే. పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగదు, అలాగే ఎక్కువ నీటి అవసరం కూడా ఉండదు. కొంతమంది దీనిని వ్యతిరేకిస్తున్నారు. చివరికి నేనే ఒక నిర్ణయం తీసుకుంటాను, అని ఆయన అన్నారు. కరువు పరిస్థితి నేపథ్యంలో దసరా వేడుకలను సరళీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. నేను దసరాను అత్యంత ఘనంగా నిర్వహిస్తాను. సాధారణ కార్యక్రమం నిర్వహించే ప్రసక్తే లేదు. పర్యాటక రంగం మొత్తం దసరాపైనే ఆధారపడి ఉంది. అందువల్ల, వేడుకలను సరళీకరించలేము, అని ఆయన అన్నారు.

**రాజకీయ లబ్ధి కోసం బీజేపీ నాగేంద్రను బలిచ్చింది**

మాజీ మంత్రి బి. నాగేంద్ర రాజీనామాపై స్పందిస్తూ, రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ఒక అమాయకుడిని బలిపశువుగా చేసిందని ఆయన ఆరోపించారు. "నాగేంద్ర ఎలాంటి తప్పు చేయకపోయినా రాజీనామా చేశారు. ఆయన రాజీనామా తర్వాత కూడా బీజేపీ పాదయాత్ర చేయాలనుకుంటే చేయనివ్వండి. వారు రాజకీయ కారణాల కోసమే ఇలా చేస్తున్నారు. నేను అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా బీజేపీ సమాధానం ఇవ్వలేదు. నాగేంద్రను ఎందుకు రాజీనామా చేసేలా బలవంతం చేశారో బీజేపీ వివరించాలి," అని ఆయన అన్నారు. తాను విధాన సౌధను అమ్మబోతున్నానన్న కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఆరోపణను కూడా ఆయన తిప్పికొట్టారు. ఎవరు ఏమి అమ్మడానికి సిద్ధపడ్డారనే చరిత్ర బయటపడితే, అంతా బయటకు వచ్చేస్తుంది. నేను ఇప్పుడే ఆ విషయాల్లోకి వెళ్లాలనుకోవడం లేదు. కుమారస్వామికి మాట్లాడటం ఇష్టం. మాట్లాడనివ్వండి, ఆనందించనివ్వండి. నన్ను మళ్లీ విమర్శించనివ్వండి, అని ఆయన అన్నారు.

## విశాఖలో

# అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

(మొదటిపేజీ తరువాయి)

మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది.

**భారీ పెట్టుబడి, ఉపాధి అవకాశాలు**

విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక**

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు.

హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట**

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం.

విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

**కాకినాడ - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది.మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.




- **హామీల నుంచి కార్పొరేట్ రుణాల వరకు..**
  **ప్రజాధనం, ప్రభుత్వ విధానాలు ఎటు?**
- **డాక్టర్ ముచ్చకోట సురేష్ బాబు**

# అచ్చేదిన్ కాదు..సచ్చేదిన్ వచ్చిందా..?

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, పెద్ద కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన రుణాలు, బ్యాంకుల మొండి బకాయిలు, ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. "అచ్చేదిన్ వస్తుంది" అన్న నినాదంతో అధికారంలోకి వచ్చిన పాలనలో సామాన్య ప్రజల జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పు వచ్చిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఎన్నికల సమయంలో విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తారనే ప్రచారం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. అయితే ఆ హామీ అమలుపై స్పష్టత లేకపోవడం, ఎన్నికల హామీలు--వాటి అమలుకు మధ్య ఉన్న అంతరంపై చర్చకు కారణమైంది.

**సామాన్యుడికి రుణభారం.. కార్పొరేట్‌కు రుణ పరిష్కారమా?**

రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు తీసుకున్న రుణాల చెల్లింపులో ఆలస్యం జరిగితే బ్యాంకుల నుంచి ఒత్తిడి ఎదురవు తుంటుంది. అదే సమయంలో భారీ కార్పొరేట్ రుణాలు మొండి బకాయిలుగా మారినప్పుడు వాటి పరిష్కార ప్రక్రియలో భారీ తగ్గింపులు చోటుచేసుకోవడంపై ఆర్థిక సమానత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
పెద్ద రుణగ్రహీతలు, చిన్న రుణగ్రహీతలకు వర్తించే విధానాల్లో తేడా ఎందుకు కనిపిస్తోంది? రుణ పరిష్కారాల వల్ల బ్యాంకులకు, తద్వారా ప్రజాధనానికి కలిగే ప్రభావం ఎంత? అనే అంశాలపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విజయ్ మాల్యా నుంచి నీరవ్ మోదీ వరకు..**

విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, లలిత్ మోదీ తదితరులకు సంబంధించిన ఆర్థిక వివాదాలు గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. బ్యాంకుల నుంచి భారీ మొత్తాలు రుణాలుగా వెళ్లిన సందర్భాల్లో రుణాల మంజూరు సమయంలో జరిగిన పర్యవేక్షణ, రుణాల వసూళ్ల ప్రక్రియ, బాధ్యత నిర్ణయంపై ప్రశ్నలు కొనసాగుతున్నాయి. ప్రజల డిపాజిట్లతో పనిచేసే బ్యాంకుల్లో భారీ రుణాలు మొండి బకాయిలుగా మారినప్పుడు వాటి వెనుక ఉన్న నిర్ణయ ప్రక్రియ, వసూళ్ల పురోగతిపై పారదర్శక సమాచారం అవసరమనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**అదానీ వ్యవహారం.. నియంత్రణ సంస్థలపై చర్చ**

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక తర్వాత అదానీ గ్రూప్‌కు సంబంధించిన అంశాలు దేశీయంగా, అంతర్జాతీయంగా చర్చకు వచ్చాయి. షేర్ మార్కెట్ నియంత్రణ, విదేశీ పెట్టుబడి దారుల వెల్లడింపులు, యాజమాన్య నిర్మాణం వంటి అంశాలపై చర్చ జరిగింది.
ఈ నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ సంస్థల స్వతంత్రత, పారదర్శకత, జవాబుదారీతనం కీలకంగా మారాయి. ఏ సంస్థపై ఆరోపణలు వచ్చినా అవి విచారణ ద్వారా నిర్ధారణ కావాల్సి ఉంటుందని, ఆరోపణలను తుది నేర నిర్ధారణగా పరిగణించరాదనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

**ఎల్ఐసీ పెట్టుబడులపై పారదర్శకత అవసరం**

కోట్లాది పాలసీదారుల నమ్మకంతో పనిచేసే ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులపై కూడా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఏ సంస్థలో ఎంత పెట్టుబడి పెట్టారు? పెట్టుబడికి ముందు రిస్క్ అంచనా ఎలా జరిగింది? ఎలాంటి ప్రమాణాలను అనుసరించారు? వంటి అంశాలపై మరింత పారదర్శక సమాచారం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సుభాష్ చంద్ర కేసుతో కొత్త చర్చ**

జీ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్రకు సంబంధించిన వ్యక్తిగత దివాలా పరిష్కార కేసు కూడా తాజాగా చర్చకు వచ్చింది. ఇందులో రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లు ఉన్నప్పటికీ, ఆ మొత్తం సుభాష్ చంద్ర వ్యక్తిగతంగా తీసుకున్న రుణం కాదనే విషయాన్ని స్పష్టంగా చూడాల్సి ఉంది. సంబంధిత కంపెనీలు తీసుకున్న రుణాలకు ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్న కేసుకు సంబంధించిన క్లెయిమ్‌లు అవి ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన పరిష్కార ప్రణాళిక ప్రకారం సుమారు రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు సంబంధించి చంద్ర వ్యక్తిగత ఎస్టేట్ నుంచి సుమారు రూ.6.5 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ పరిణామం వ్యక్తిగత హామీదారుల బాధ్యత, అసలు రుణగ్రహీత కంపెనీల బాధ్యత, బ్యాంకుల రుణ వసూళ్లపై చర్చకు దారితీసింది. అయితే దీనిని మొత్తం రూ.22 వేల కోట్ల రుణమాఫీగా పేర్కొనడం పూర్తి వాస్తవాన్ని ప్రతిబింబించదని, ఇది ప్రధానంగా వ్యక్తిగత హామీదారుడి బాధ్యతకు సంబంధించిన పరిష్కారమని న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

**ప్రజాధనానికి జవాబుదారీ ఎవరు?**

బ్యాంకులు ప్రజల డిపాజిట్లతో పనిచేస్తున్న నేపథ్యంలో భారీ రుణాల మంజూరు, రుణాల వసూళ్లు, మొండి బకాయిల పరిష్కారం వంటి అంశాల్లో జవాబుదారీతనం అత్యంత కీలకంగా మారింది.రుణాలు మంజూరు చేసేటప్పుడు ఆస్తుల విలువను ఎలా అంచనా వేశారు? రిస్క్ విశ్లేషణ ఎలా జరిగింది? రుణం మొండి బకాయిగా మారిన తర్వాత చర్యలు ఏమిటి? రుణదాతలకు ఎంత మొత్తం తిరిగి వచ్చింది? ప్రజాధనానికి జరిగిన నష్టం ఎంత? బాధ్యత వహించాల్సిన సంస్థలు లేదా వ్యక్తులపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

**నినాదాలు కాదు.. జవాబుదారీ పాలన కావాలి**

అచ్చేదిన్ అంటే కేవలం ఆర్థిక సూచీలు లేదా స్టాక్ మార్కెట్ పెరుగుదల మాత్రమే కాదని, సామాన్యుడి జీవన ప్రమాణాల్లో మెరుగుదల కనిపించాల్సి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రైతుకు రుణం, యువతకు ఉపాధి, చిన్న వ్యాపారికి ఆర్థిక సహాయం, మధ్య తరగతికి ధరల భారం తగ్గడం, ప్రజాధనానికి రక్షణ, పెద్ద--చిన్న రుణగ్రహీతలకు సమాన న్యాయం, ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల్లో పారదర్శకత వంటి అంశాలే ప్రజలకు నిజమైన మార్పును చూపి స్తాయి. ఎన్నికల హామీలు, వాటి అమలు మధ్య అంతరం, భారీ రుణాల పరిష్కారాలు, ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు, నియంత్రణ సంస్థల పనితీరు వంటి అంశాలపై ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాలకే పరిమితం కాదు.. ప్రతి పౌరుడి హక్కు.అచ్చేదిన్ పేరుతో వచ్చిన మార్పు సామాన్యుడి జీవితంలో కనిపిస్తుందా? లేక "సచ్చేదిన్" వచ్చిందా? అన్నది ప్రజల ముందున్న ప్రశ్న.



# ఎన్ని కార్యాలయాల చుట్టూ తిరగాలి

# న్యాయం ఎప్పుడు..?

- **ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగినా పరిష్కారం లేదా?**
- **ఆర్టీఐ దరఖాస్తులకు స్పందన కరువు.. ప్రజా ఫిర్యాదులూ మూసివేత**
- **కనేకల్ మండలం 43 ఉడేగోళ్లం భూ సమస్యలపై బాధితుల ఆవేదన**
- **కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి**

**కనేకల్ - సూర్య వాస్తవం :**
తమ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ, సర్వే శాఖల కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా న్యాయం దక్కడం లేదని కనేకల్ మండలం 43 ఉడేగొల్లం గ్రామానికి చెందిన భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత రుసుములు చెల్లించి సర్వేకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంలో జాప్యం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. 220-1, 220-3, 221-ఎ, 221-ఎ3, 224-1, 224-4 సర్వే నంబర్లకు సంబంధించి భూముల హద్దులు, పట్టాదారుల వివరాలు, మ్యుటేషన్లు, భూ రికార్డుల్లో నమోదైన మార్పులపై స్పష్టత కావాలని బాధితులు కోరుతున్నారు.

**రీ-సర్వేపై అనుమానాలు**

తమకు ముందస్తు సమాచారం లేదా నోటీసులు ఇవ్వకుండానే రీ-సర్వే ప్రక్రియ చేపట్టినట్లు అనుమానాలు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. భూ యజమానులకు సమాచారం ఇవ్వకుండా సర్వే నిర్వహించి ఉంటే ప్రక్రియ పారదర్శకతపై సందేహాలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా సర్వే శాఖ అధికారులను కూడా ఆశ్రయించినట్లు తెలిపారు.

**ఫిర్యాదు మూసివేత.. సమస్య పరిష్కారం ఎక్కడ?**

భూ సమస్యలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పలు ఫిర్యాదులు చేసినప్పటికీ, తమను సంప్రదించకుండానే ఫిర్యాదులను పరిష్కరించినట్లు నమోదు చేసి మూసివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.తమ వాదన వినకుండా, భూముల వద్ద క్షేత్రస్థాయి విచారణ నిర్వహించకుండా సమస్య పరిష్కారమైందని ఎలా నమోదు చేశారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదుదారుల వాదనతో పాటు సంబంధిత భూ రికార్డులు, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆర్టీఐ దరఖాస్తులకు సమాధానం ఏది?**

భూ రికార్డులు, సర్వే వివరాలు, అధికారుల చర్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు చేసినప్పటికీ సమయానికి స్పష్టమైన సమాచారం అందలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయం జరుగుతుందని ఆశిస్తూ బాధితులు దాఖలు చేసిన ATP202605048747 (Missing/Modification of Sy Nos), ATP20260107219 (Erroneous Entry of Pattadars, ATP20251208147 (వీబ్ఫ్అశీలం టశీతీ ఞఖుశ్రీవ ఝఖంవం), ూ్ూ202512153076 ఫిర్యాదుల విషయంలో తమను విచారించలేదని వారు పేర్కొంటున్నారు. పొలాల వద్దకు వచ్చి క్షేత్రస్థాయి విచారణ నిర్వహించలేదని ఆరోపిస్తున్న బాధితులు.. సర్వేకు సంబంధించి నోటీసులు ఇచ్చారా? పంచనామా, నివేదికలు ఉన్నాయా? ఫిర్యాదులను ఏ ఆధారాలతో మూసివేశారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత భూ యజమానుల సమక్షంలో పారదర్శకంగా సర్వే, రీ-సర్వే నిర్వహించి భూముల హద్దులను నిర్ధారించాలని కోరుతున్నారు. ఇప్పటికే మూసివేసిన ఫిర్యాదులను మరోసారి పరిశీలించి, అవసరమైతే తిరిగి తెరిచి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భూ రికార్డుల్లో తప్పులు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం సరిచేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు న్నారు. మా భూములకు సరైన హద్దులు, సరైన రికార్డులు కావాలి. ఫిర్యాదులను కేవలం ఆన్‌లైన్‌లో మూసివేయకుండా క్షేత్ర స్థాయిలో సమస్యను పరిష్కరించాలి" అని బాధితులు కోరుతున్నారు.

# అనంతపురానికి సీఎం చంద్రబాబు...!

## - శిల్పారామం హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శిల్పారామం నుంచి ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు, పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

# సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం...!

## - హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని ఎంవీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ చైర్మన్ శ్రీ పూల నాగరాజు కుమారుని వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం శిల్పారామం హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపిన అనంతరం వివాహ వేడుకల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు



**అనంతపురం - సూర్య వాస్తవం :** టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు అనంతపురం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షుడు చేపలహరి, తెలుగుదేశం పార్టీ 5వ క్లస్టర్ ఇన్‌చార్జ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని బెస్త సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చేపలహరి తెలిపారు. బెస్త సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ సమస్యలను సానుకూలంగా విన్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి దొంగలు దొరకునా..?

## - ఉపాధి హామీలో అక్రమాలకు అడ్డుకట్ట ఎప్పుడు...?



- పామిడిలో అక్రమ చెల్లింపులు గుర్తింపు.. ఇతర మండలాల్లోనూ ఇదే తరహా ఆరోపణలు
- ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి ఏపీవోల వరకు సమగ్ర విచారణ జరపాలంటున్న ప్రజలు
- కొన్ని ఫిర్యాదులు వస్తున్నా చర్యలు ఎందుకు లేవని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్న వైనం

**అనంతపురం /పామిడి, ప్రత్యేక కథనం - సూర్య వాస్తవం :** గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడాల్సిన ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చోటు కల్పిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా పామిడి మండలంలో పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుపై జరిగిన విచారణలో అర్హత లేని వ్యక్తుల పేరిట వేతనాలు చెల్లించినట్లు అధికారులు గుర్తించి, కట్టకిందపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని డ్వామాకు నివేదిక పంపడం ఈ వ్యవహారంపై మరోసారి చర్చకు దారితీసింది. పామిడి మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్నవారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థుల పేరిట ఉన్న జాబ్ కార్డులకు ఉపాధి హామీ వేతనాలు చెల్లించినట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం పలు జాబ్ కార్డులకు సంబంధించి రూ. 18,232, విద్యార్థుల జాబ్ కార్డుకు రూ. 17,978, కొనకొండ్ల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల జాబ్ కార్డులకు రూ. 8,700 చెల్లింపులు జరిగినట్లు నివేదికలో వెల్లడైంది.

### పామిడితోనే ఆగిపోతుందా?

పామిడి మండలంలో వెలుగుచూసిన వ్యవహారం ఒక ఉదాహరణ మాత్రమేనా? లేక జిల్లాలోని మరికొన్ని మండలాల్లోనూ ఇలాంటి అక్రమాలు కొనసాగుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడేరు, ఉరవకొండ, గుంతకల్లు తదితర మండలాల్లోనూ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఇలాంటి ఆరోపణలు వినిపించినప్పటికీ, వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు పెద్దగా కనిపించడం లేదని పలువురు అంటున్నారు.

### అందరి పాత్రపైనా విచారణ అవసరం

ఉపాధి హామీ పనుల అమలులో ఫీల్డ్ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అధికారులు, ఏపీవోల పాత్రపై కూడా సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ఒక వ్యక్తి స్థాయిలో తప్పిదం జరిగిందా? లేక పలువురు కలిసి వ్యవస్థను దుర్వినియోగంచేశారా? అన్నది ఉన్నతాధికారుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### కొన్నిరోజులుగా ఆరోపణలు.. చర్యలు ఎప్పుడు?

కొన్ని మండలాల్లో తరచుగా ఉపాధి హామీ పథకంలో అక్రమాలపై ఫిర్యాదులు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులు అందుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు సమగ్రంగా దర్యాప్తు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన ప్రతిసారి కేవలం ఒకరిద్దరిపై చర్యలతో వ్యవహారాన్ని ముగించకుండా, జాబ్ కార్డుల నమోదు నుంచి పనుల కేటాయింపు, హాజరు నమోదు, మస్టర్లు, వేతనాల చెల్లింపుల వరకు మొత్తం ప్రక్రియను పరిశీలించాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకంలో నిజమైన కూలీలకు దక్కాల్సిన ప్రయోజనాలు పక్కదారి పట్ట కుండా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిం చాలని ప్రజలు కోరుతున్నారు. పామిడి ఘటనను ప్రాతి పదికగా తీసుకుని జిల్లావ్యాప్తంగా గత కొన్నేళ్లలో జరిగి న ఉపాధి హామీ చెల్లింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, తప్పిదాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రశ్న ఒక్కటే.. ఫిర్యాదులు వస్తున్నా విచారణలు ఎందుకు ఆలస్యం? అక్రమాలు నిజమైతే బాధ్యులపై చర్యలు ఎప్పుడు?

# మీకోసం' 1100 కాల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ ఓ. ఆనంద్...!
- ఆగస్టు 31న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ఉదయం 9 గంటల నుంచి పీజీఆర్ఎస్.. అందుబాటులో అన్ని శాఖల అధికారులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం:** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం అందిస్తున్న 'మీకోసం' కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ జిల్లా ప్రజలకు సూచించారు. అర్జీదారులు గతంలో దాఖలు చేసిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదుల ప్రస్తుత స్థితి తెలుసుకోవాలన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేయవచ్చని తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలకు 1100 సేవలపై అవగాహన కల్పించేందుకు రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో 'మీకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100' అనే బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఆగస్టు 31న పీజీఆర్ఎస్.. రెవెన్యూ క్లినిక్

ఆగస్టు 31వ తేదీ సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి పీజీఆర్ఎస్ నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో అందజేయాలని సూచించారు. గతంలో అర్జీ సమర్పించిన వారు సంబంధిత రసీదు లేదా స్లిప్పును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు.

### ఫోన్‌కు మెసేజ్.. వాట్సాప్‌లో సమాచారం

అర్జీ పరిష్కారమైనప్పుడు అర్జీదారుల ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, ఎప్పటికప్పుడు ఫోన్‌ను పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌లను వాట్సాప్ ద్వారా పంపుతున్నామని, అవసరమైన ఎండార్స్‌మెంట్‌ను రిజిస్టర్ పోస్టు ద్వారా అర్జీదారు ఇచ్చిన చిరునామాకు పంపుతున్నట్లు తెలిపారు. అర్జీ సమర్పించే సమయంలో వివరాలను తప్పులు లేకుండా సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. పదేపదే అర్జీలు సమర్పించే వారు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన రసీదును తీసుకురావాలని తెలిపారు.

### మండల స్థాయి వరకు పీజీఆర్ఎస్

సోమవారం ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు డివిజన్, మండల, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, పీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు 1100 కాల్ సెంటర్, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఓ. ఆనంద్ కోరారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్...!

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి

**అనంతపురం - సూర్య వాస్తవం**

అనంతపురం పట్టణంలోని ఎంవీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన గుంతకల్లు శాసనసభ్యులు శ్రీ గుమ్మనూరు జయరాం గారి కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడి వివాహ వేడుకకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కమ్మూరు మాజీ ఎంపీటీసీ నీలావతి కుమారుడి వివాహ వేడుకకు మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.





మంత్రి వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

- అనంతపురం చరిత్ర సృష్టించింది.. నాలుగు గంటల్లో 125 మందికి కృత్రిమ చేతుల అమరిక
- 125 కుటుంబాల్లో కొత్త ఆశలు.. స్వావలంబనకు బాటలు
- ఎందరో జీవితాల్లో వెలుగులు నింపే మహా యజ్ఞం: డిస్కవర్ అనిల్ కుమార్

# ఇది కృత్రిమ చేతుల అమరిక కాదు..
# జీవితాలకు చేయూత




**అనంతపురం - సూర్య వాస్తవం :** అది కేవలం కృత్రిమ చేయి అమర్చిన కార్యక్రమం కాదు.. ఒక వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి అందించిన రోజు. ఒక కుటుంబానికి కొత్త భరోసా కల్పించిన రోజు. కోల్పోయిన జీవనోపాధిని తిరిగి పొందేందుకు మరో అవకాశం ఇచ్చిన రోజు. అనంతపురం మానవతా సేవలో మరో ప్రత్యేక ఘనతను సాధించింది. కేవలం నాలుగు గంటల వ్యవధిలో చేతులు కోల్పోయిన దాదాపు 125 మందికి కృత్రిమ యాంత్రిక చేతులను ఉచితంగా అమర్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3160, అమెరికాకు చెందిన ఎల్ఎన్4 ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన 'చేయూత' కార్యక్రమంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది.ఒక్కో కృత్రిమ యాంత్రిక చేయి విలువ సుమారు 350 అమెరికన్ డాలర్లు కాగా, అర్హులైన వారికి వాటిని పూర్తిగా ఉచితంగా అందించారు.కృత్రిమ చేయి విలువను డాలర్లలో చెప్పవచ్చు.. కానీ అది అందించే ఆత్మవిశ్వాసం, స్వావలంబన, జీవనోపాధి విలువను డబ్బుతో కొలవలేం.చేతులు కోల్పోయిన చిన్నారులకు రోజువారీ పనులను స్వయంగా చేసుకునే అవకాశం.. ప్రమాదాల్లో చేయి కోల్పోయిన వారికి తిరిగి పనిలోకి వెళ్లాలనే నమ్మకం.. జీవనాధారమైన చేతిని కోల్పోయిన కార్మికులకు మళ్లీ ఉపాధి పొందాలనే ఆశ.. కుటుంబ సభ్యుడి వైకల్యంతో ఆందోళన చెందిన కుటుంబాలకు కొత్త భరోసా..



**కన్నీళ్లతో వచ్చిన వారు.. చిరునవ్వుతో వెళ్లారు**

చేతులు లేక చిన్నప్పటి నుంచే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నారులు, ప్రమాదాల్లో చేతులు కోల్పోయిన రైతులు, కార్మికులు, తమ చేతులపైనే ఆధారపడి జీవనం సాగించిన పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.కొత్త కృత్రిమ చేయి అమర్చుకున్న అనంతరం వారిలో కనిపించిన ఆనందం, ఆత్మవిశ్వాసం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఒక వస్తువును పట్టుకోవడం.. రోజువారీ పనులు చేసు కోవడం.. తిరిగి ఉపాధి పొందడం.. కుటుంబానికి అండగా నిలవడం.. ఇవన్నీ మళ్లీ సాధ్యమవుతాయనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం కల్పించింది.

**125 చేతులు కాదు.. 125 జీవితలు కొత్త ప్రారంభాలు**

చేతిని కోల్పోవడం అంటే కేవలం శారీరక అవయవాన్ని కోల్పోవడం మాత్రమే కాదు. దానితో పాటు ఉపాధి, ఆత్మవిశ్వాసం, స్వతంత్ర జీవనం, కుటుంబాన్ని పోషించే సామర్థ్యం కూడా ప్రభావితమవుతాయి.ఈ నేపథ్యంలో 'చేయూత' కార్యక్రమం ఒక సహాయక పరికరాన్ని అందించే కార్యక్రమంగా మాత్రమే కాకుండా స్వావలంబనకు బాటలు వేసే మానవతా కార్యక్రమంగా నిలిచింది.దాదాపు 125 మంది లబ్ధిదారులతో పాటు వారి కుటుంబాలపై కూడా ఈ సేవా కార్యక్రమం సానుకూల ప్రభావం చూపనుంది.

**సేవ అంటే.. జీవితాన్ని మార్చే అవకాశం**

ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఈ. మోహన్, వైస్ చైర్మన్ రవి వడ్లమాని, రోటరీ జిల్లా గవర్నర్ కేశవ రెడ్డి, రోటరీ మాంక్ రాజు మాట్లాడుతూ.. దివ్యాంగుల జీవితాల్లో మార్పు తీసుకురాగల కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అవసరంలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడం సేవ అయితే.. అతను తిరిగి తనంతట తానుగా జీవించేలా అవకాశం కల్పించడం నిజమైన సేవ అని పేర్కొన్నారు.

**ఒక్కటైన సేవా శక్తి**

కార్యక్రమం విజయవంతం కావడంలో పలువురు సేవా సంస్థలు, స్వచ్ఛంద సేవకులు కీలక పాత్ర పోషించారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం స్వచ్ఛంద సేవకులు, రోటరీ క్లబ్‌లు, ఇన్నర్ వీల్, ఎన్ఎస్ఎస్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అనంతపురం, రోటరాక్ట్ సభ్యులు సమన్వయంతో పనిచేశారు.వారి అంకితభావం, సేవా స్ఫూర్తి, సమన్వయంతోనే ఇంత పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు కేవలం నాలుగు గంటల్లో కృత్రిమ చేతుల అమరిక సాధ్యమైంది.



**ఎందరో జీవితాల్లో వెలుగులు నింపే మహా యజ్ఞం**

ఈ కార్యక్రమంపై డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు, కన్వీనర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ..... ఈ కార్యక్రమం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఇది ఒక మహా యజ్ఞంలాంటిదని, దీని ద్వారా ఎందరో జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజ సేవలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఐఆర్‌సీఎస్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనిల్‌లో నిర్వేదం..




**నెల్లూరు-సూర్య వాస్తవం :**పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు.మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది.

పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది.ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్




**విజయవాడ- సూర్య వాస్తవం :**విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు.చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్? కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు.ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే..

వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

# గంజాయి సరదా కాదు..

# జీవితాన్ని నాశనం చేసే వ్యసనం...

## - గంజాయి బారిన పడొద్దు..యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు!..

## - డీఎస్పీ చెంచు బాబు

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ జి. చెంచుబాబు సూచించారు.యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండి చదువు,ఉద్యోగం,క్రీడలు వంటి మంచి మార్గాలపై దృష్టి పెట్టాలని కోరారు.గంజాయి సరదాగా మొదలై వ్యసనంగా మారితే చదువు, ఆరోగ్యం,కుటుంబ సంబంధాలు,భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.



**"తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి"**

పిల్లల స్నేహాలు,ప్రవర్తన,రోజువారీ కార్యకలాపాలను గమనించాలి.పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలి. వారికి తగినంత సమయం కేటాయించి మంచి మార్గంలో నడిపించాలి. గంజాయి, మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించాలి. గంజాయి వినియోగం,విక్రయాలు లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ చెంచుబాబు కోరారు."పిల్లలను కేవలం మందలించడం కాదు.. వారి మాట వినాలి,వారి సమస్యలను అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయిస్తే వారు తప్పుదారి పట్టే అవకాశాలను తగ్గించవచ్చు."అని డీఎస్పీ సూచించారు.

"గంజాయికి దూరంగా ఉండండి. జీవితాన్ని గెలుచుకోండి.ఈరోజు తీసుకునే మంచి నిర్ణయమే మీ రేపటి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. "మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులకు ప్రజలు సహకరించాలి. యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.డీఎస్పీ జి.చెంచుబాబు సూచించారు.

# శక్తి మహిళా పోలీసుల విస్తృత అవగాహన

- జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో విస్తృత అవగాహన కార్యక్రమాలు.
- సైబర్ నేరాలు, మహిళలు--బాలల భద్రతపై ప్రజలకు అవగాహన
- బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, గృహ హింసపై చైతన్యం
- యువతలో ఆకర్షణలు,క్రమశిక్షణపై ప్రత్యేక సూచనలు
- అత్యవసర సేవలకు 112,సైబర్ మోసాలకు 1930పై అవగాహన





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు శక్తి మహిళా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ధామినేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతంలో ప్రజలకు సైబర్ నేరాలు,మహిళలపై నేరాలు,గృహ హింస, బాల కార్మిక వ్యవస్థ,బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. యువతలో ఏర్పడే ఆకర్షణలు, వాటి వల్ల ఎదురయ్యే సమస్యలు,క్రమశిక్షణతో వ్యవహరించాల్సిన అవసరంపై సూచనలు చేశారు. అదేవిధంగా రైతు మార్కెట్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రతా భరోసా కల్పించారు.

అత్యవసర సమయంలో డయల్ 112, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని శక్తి మహిళా పోలీసులు సూచించారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన ముందస్తు వేడుకలు..

## - ఘనంగా మెగా రక్తదాన శిబిరం

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం, దొరవారిసత్రం మండలం లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన ముందస్తు వేడుకల సందర్భంగా భారీ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.జనసేన నాయకుడు ఏంబేటి ప్రవీణ్ ఆధ్వర్యంలో"నోవా బ్లడ్ బ్యాంక్" సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నాయకుడు షేక్ మాభాష హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా షేక్ మాభాష మాట్లాడుతూ."పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో రక్తం అందక ఒక్క ప్రాణం కూడా పోకూడదు"అన్న మాటలను ఆదర్శంగా తీసుకొని ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానాలన్నింటిలోకెల్లా రక్తదానం అత్యంత పవిత్రమైనదని,రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మనం ఇచ్చే రక్తం పునర్జన్మను ఇస్తుందన్నారు. సమాజ సేవలో జనసేన కార్యకర్తలు, మెగా అభిమానులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు.ఈ ప్రాణదాన కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రతీ ఒక్క రక్తదాతకూ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆవుల దాస్, వీర మహిళ సుజాత, కళ్యాణ్, సనత్ కుమార్,దొడ్డి శరత్ కుమార్, డమయి కార్తీక్ ఎలింబెటి ఉదయ్ రాజ్ దినేష్, అఖిల్, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# జనసైనికుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న

# మండల అధ్యక్షుడు కాశంశెట్టి సుధీర్...!

## - వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు

**బెలుగుప్ప - సూర్య వాస్తవం :** బెలుగుప్ప మండల జనసేన పార్టీ మండల కార్యదర్శి మనిగే అభి వివాహ మహోత్సవం ఆదివారం బుడిగుమ్మ సంజీవరాయ స్వామి దేవాలయంలో ఘనంగా జరిగింది. అభి, భవాని వివాహ వేడుకకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కాశంశెట్టి సుధీర్, మండల ఉపాధ్యక్షుడు జెన్నే మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ కానుకను అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖ సంతోషాలతో, ఆయురా రోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రవినాయక్, వన్నూరుస్వామి, అశోక్, తిప్పయ్య, చరణ్‌తో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ

## -నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి తొట్టెంబేడు మండలం సీ.ఆర్.ఎన్ కండ్రిగ గ్రామంలోని సీ.సీ.ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన శాప్ మాజీ ఛైర్మన్ దివంగత పీఆర్ మోహన్ కుమార్తె వివాహ వేడుకకు కూటమి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ,నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నిలవల సుబ్రహ్మణ్యంలు కలిసి దివంగత నేత పిఆర్ మోహన్ కుమార్తె వివాహ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు...

# మాజీ కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మాజీ కౌన్సిలర్ పాలా మురళికి ఇటీవల కాలు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో, ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను సూళ్లూరుపేట మాజీ శాసన సభ్యులు శ్రీ కిలివేటి సంజీవయ్య ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా పాలా మురళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాం క్షించారు. కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలను తెలుసు కున్నారు. వీరితోపాటు సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు జెటు వేణు యాదవ్, సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ కృపాకర రెడ్డి మాజీ కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట పట్టణంలోని టీవీఆర్ కళ్యాణ మండపంలో ఈరోజు నిర్వ హించిన ప్రీతం రెడ్డి,రిషిత రెడ్డిల వివాహ వేడుకలకు సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా పలకరించి, ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాం క్షించారు. అనంతరం వివాహ వేడుకలకు హాజరైన నాయకులు ,కార్యకర్తలు, బంధుమిత్రులు మరియు అభిమానులతో కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి,జిల్లా కార్యదర్శి జెట్టి వేణు యాదవ్, నాయుడుపేట టౌన్ ప్రెసిడెంట్ కలికి మాధవరెడ్డి, తడ మండల ప్రెసిడెంట్ ఆరుముగం మున్సిపల్ కౌన్సిలర్ మీజ్జూరు రాంకృష్ణ రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఏర్పాటు

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం తిరుపతి జిల్లా ఇన్చార్జి ఎం ఎస్ పి వర్ల దేవదాస్ మాదిగ ,సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి కుక్క మల్లి రవి మాదిగ , దొరవారిసత్రం మండల ఇంచార్జి కంటేపల్లి నాగేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం దొరవారిసత్రం మండల కార్యాలయం నందు ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ మండల అధ్యక్షునిగా మొండెం మునికృష్ణ మాదిగ, ఉపాధ్యక్షునిగా చేవూరి దామోదరం మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి మొండెం ముని వేలు మాదిగ,కార్యదర్శి కంటేపల్లి మల్లికార్జున మాదిగ, కోశాధికారి గోవిందు రామ్మూర్తి మాదిగ ఎన్నుకోవడం జరిగింది.





# కింగ్ 100 ప్రపంచంలోకి!

టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున కెరీర్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'కింగ్ 100'. నాగార్జున నటిస్తున్న మైలురాయి లాంటి 100వ సినిమా కావడంతో ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ ప్రాజెక్టుపై ప్రేక్షకుల్లో, అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించి ఏ చిన్న వార్త బయటకు వచ్చినా నెట్టింట తెగ వైరల్ అవుతోంది. తాజాగా ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలింనగర్ వర్గాల్లో హల్చల్ చేస్తోంది. ఈ సినిమాలో వర్సటైల్ యాక్ట్రెస్ ఐశ్వర్య రాజేశ్ కీలక పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు జోరందుకున్నాయి. అయితే, చిత్ర యూనిట్ ఆమె పేరును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కానీ ఇటీవల నాగార్జున పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కింగ్ 100' టైటిల్ గ్లింప్స్‌నున ఐశ్వర్య రాజేశ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. దీంతో ఈ సినిమాలో ఆమె నటించడం దాదాపు ఖాయమేనని అక్కినేని అభిమానులు, నెటిజన్లు భావిస్తున్నారు. ఐశ్వర్య రాజేశ్ ఇప్పటికే తెలుగు, తమిళ భాషల్లో పర్ఫార్మెన్స్ ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ సరసన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించి మెప్పించారు. ప్రస్తుతం సుమంత్ సరసన 'మహేంద్రగిరి వరాహి' అలాగే రవితేజ కొత్త ప్రాజెక్టుల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈ భామకు, నాగార్జున 100వ సినిమాలో నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పవచ్చు. సాధారణ కమర్షియల్ ఫార్ములాకు భిన్నంగా, కథ మరియు పాత్రలకు ప్రాధాన్యత ఇస్తూ రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో టబు, సుస్మిత భట్ కూడా ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 24న బాక్సాఫీస్ ముందుకు తీసుకురానున్నారు. నాగ్ 100వ సినిమాలో ఐశ్వర్య రాజేశ్ పాత్ర ఎలా ఉండబోతుందో చూడటానికి సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# 'ప్రతిబంధ్' కోసం జూహీ చావ్లా వద్దనుకున్నా... కానీ!: మెగాస్టార్ చిరంజీవి



తాను బాలీవుడ్ అరంగేట్రం చేసిన 'ప్రతిబంధ్' (1990) సినిమాలో హీరోయిన్‌గా జూహీ చావ్లాను ఎంపిక చేసే విషయంలో తాను మొదట సందేహించానని మెగాస్టార్ చిరంజీవి గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇప్పుడీ వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జూహీ చావ్లాను చూసినప్పుడు, ఆమె తమ పాత్రకు సరిపోతుందా లేదా అనే అనుమానం కలిగిందని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, "నేను జూహీ చావ్లాను 'ఖయామత్ సే ఖయామత్ తక్' సినిమాలో చూశాను. అందులో ఆమె చాలా చలాకీగా, టీనేజ్ అమ్మాయి పాత్రలో కనిపించారు. దాంతో 'ప్రతిబంధ్'లోని శాంతి లాంటి సీరియస్ పాత్రకు ఆమె సరిపోతారా లేదా అనే సందేహం మాకు కలిగింది. కానీ ఒకసారి, మేము అనుకున్న పాత్ర గెటప్‌కు దగ్గరగా ఉన్న ఆమె ఫొటోగ్రాఫ్ చూశాం. అప్పుడు కచ్చితంగా ఈమెను ఎందుకు తీసుకోకూడదు అనిపించింది. పాత్రకు కావాల్సిన అమాయకత్వం, సానుభూతిని పంచే ముఖం ఆమెది. అందుకే జూహీని సంప్రదించాం, ఆమె వెంటనే అంగీకరించింది" అని చిరంజీవి వివరించారు. సినిమాలో జూహీ నటన పట్ల తాము ఎంతో సంతోషంగా ఉన్నామని చిరంజీవి ప్రశంసించారు. "ఆమె నటనతో మేము చాలా సంతృప్తి చెందాం. ముఖ్యంగా కోర్టు సీన్‌లో, జైలు దగ్గర నేను ఆమెను ఒప్పించే సన్నివేశంలో ఆమె అద్భుతంగా నటించింది" అని చిరంజీవి కొనియాడారు. రవిరాజా పినిశెట్టి దర్శకత్వం వహించిన 'ప్రతిబంధ్', తెలుగులో సంచలన విజయం సాధించిన 'అంకుశం' (1989) చిత్రానికి హిందీ రీమేక్. ఈ సినిమాతోనే చిరంజీవి బాలీవుడ్‌కు పరిచయమయ్యారు. రామిరెడ్డి కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని నమోదు చేసింది.

# తిరిగి షూటింగ్‌కు సిద్ధమైన రష్మిక..

## - ఇంట్లో గడిపిన రోజుల్ని మిస్సవుతా అంటూ పోస్ట్



'పుష్ప' బ్యూటీ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న గాయం నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇటీవలే ఎదురైన తుంటి గాయం కారణంగా కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె, త్వరలోనే తిరిగి కెమెరా ముందుకు రానున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంట్లో గడిపిన సరదా క్షణాలను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. "త్వరలోనే తిరిగి పనిలోకి వెళుతున్నాను. ఈ సమయాన్ని నేను కచ్చితంగా మిస్సవుతాను" అని రష్మిక తన పోస్టులో రాసుకొచ్చారు. విశ్రాంతి సమయంలో తాను కుటుంబంతో కలిసి ప్రార్థనలు చేయడం, సినిమాలు చూడటం, పజిల్స్ పూర్తి చేయడం, తన పెంపుడు జంతువులతో ఆడుకోవడం వంటి మధురమైన క్షణాలకు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం 'మైసా' అనే తన కొత్త చిత్రం షూటింగ్ సమయంలో రష్మిక తీవ్రమైన తుంటి గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు వైద్యులు విశ్రాంతిని సూచించారు. ఈ విరామం తనకు జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని ఇచ్చిందని రష్మిక గతంలో పేర్కొన్నారు. "గతంలో తీరిక లేకుండా పనిచేస్తున్నప్పుడు 'నెమ్మదించడం' అనేది భయంగా అనిపించేది. కానీ ఇప్పుడు విశ్రాంతి తీసుకున్నాక, ఆ హడావిడి జీవితమే భయంగా అనిపిస్తోంది. బహుశా ఇదే జీవితం కావచ్చు" అంటూ ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రష్మిక తిరిగి కోలుకుని షూటింగ్‌కు సిద్ధం కావడం పట్ల ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "నువ్వు పూర్తిగా కోలుకుని మళ్లీ పనిలో చేరడం చాలా సంతోషంగా ఉంది" "నిన్ను మళ్లీ తెరపై చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఈ అప్‌డేట్‌తో ఆమె అభిమానులు తమ అభిమాన నటిని వెండితెరపై చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# జడ్డూ నో బాల్స్‌పై గవాస్కర్ ఫైర్..

## బౌలర్‌తో పాటు కోచ్‌కూ జరిమానా వేయాలన్న సన్నీ!



శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగిసినప్పటికీ, టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ప్రదర్శన, ముఖ్యంగా అతని క్రమశిక్షణా రాహిత్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిరీస్ ఆసాంతం పదేపదే క్రీజు దాటి బంతులు విసిరిన జడేజా తీరుపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశాడు. కేవలం ఆటగాడికే కాకుండా, బౌలింగ్ కోచ్‌కు కూడా జరిమానా విధించాలని సన్నీ సంచలన సూచన చేశాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో రవీంద్ర జడేజా పలుమార్లు నో బాల్స్ వేశాడు. గణాంకాల ప్రకారం.. 2021 నుంచి ఇప్పటివరకు అతను 85కి పైగా నో బాల్స్ వేశాడంటే అతని బౌలింగ్‌లో క్రమశిక్షణ ఎంతగా లోపించిందో అర్థం చేసుకోవచ్చు. జడేజానే కాకుండా, అరంగేట్ర స్పిన్నర్ సారాంశ్ జైన్ కూడా రెండో టెస్టులో అనేక నో బాల్స్ వేసి నిరాశపరిచాడు. ఈ వ్యవహారంపై భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే స్పందిస్తూ.. "టెస్టుల్లో కూడా నో బాల్స్‌కు ఫ్రీ హిట్ పెడితే బౌలర్లు జాగ్రత్త పడతారేమో" అని సరదాగా వ్యాఖ్యానించాడు. అయితే, కోచ్ వ్యాఖ్యలపై సునీల్ గవాస్కర్ తీవ్రంగా మండిపడ్డాడు. "టెస్టు క్రికెట్‌లో బ్యాటర్లకు పరుగులు చేయడం ఇప్పటికే చాలా సులభంగా మారింది. ఓవర్‌కు రెండు బౌన్సర్ల పరిమితి, బౌండరీ లైన్లను దగ్గరకు జరపడం వంటివి ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఫ్రీ హిట్‌లు ప్రవేశపెట్టి బ్యాటింగ్‌ను మరింత సులభతరం చేయొద్దు" అని గవాస్కర్ ఘాటుగా పేర్కొన్నాడు. నో బాల్స్ వేయకుండా ఉండటం అనేది పూర్తిగా ఆటగాళ్ల నియంత్రణలో ఉండే అంశమని, టేప్ మెజర్‌తో రనప్ మార్క్ చేసుకునే ఈ ఆధునిక రోజుల్లో ఇలాంటి పొరపాట్లకు క్షమాపణలు ఉండవని స్పష్టం చేశాడు. ఈ




సమస్యకు పరిష్కారంగా గవాస్కర్ కొన్ని ఆసక్తికర సూచనలు చేశాడు. "నో బాల్ వేసిన ఆటగాడికి భారీ జరిమానా విధించాలి. అదే తప్పు మళ్లీ పునరావృతం చేస్తే ఆ జరిమానాను రెట్టింపు చేయాలి. అంతటితో ఆగకుండా, ఆటగాడి జరిమానాలో సగం మొత్తాన్ని బౌలింగ్ కోచ్‌కు కూడా విధించాలి. అప్పుడే బాధ్యత పెరుగుతుంది" అని అన్నాడు. ఈ జరిమానాల ద్వారా వసూలైన మొత్తంతో సిరీస్ చివరలో టీమ్ సభ్యులందరికీ డిన్నర్ ఏర్పాటు చేయవచ్చని, ఇది జట్టులో బంధాన్ని మరింత పెంచుతుందని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. అంతేకాకుండా ఫీల్డింగ్‌లో త్రోను బ్యాకప్ చేయకపోవడం వంటి ఇతర చిన్న పొరపాట్లకు కూడా జరిమానాలు విధించే కొత్త ఆలోచనను జట్టు సభ్యులు ఓటింగ్ ద్వారా నిర్ణయించుకోవచ్చని, ఇది ఒక సరదా కార్యకలాపంగా మారుతుందని పేర్కొన్నాడు.



# భారత్‌కు వరల్డ్ కప్ గెలవడమే నా కల : అనన్య బంగర్

టీమిండియా మాజీ బ్యాటర్, కోచ్ సంజయ్ బంగర్ కుమార్తె అనన్య బంగర్ తన క్రికెట్ కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతోంది. ఆస్ట్రేలియాలో జరిగే ప్రతిష్ఠాత్మక మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో ఆడేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా ఆమెకు అర్హత కల్పించింది. ఈ కీలక పరిణామం తర్వాత తన అంతిమ లక్ష్యం భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడమేనని అనన్య స్పష్టం చేసింది. ఈ క్రమంలో బీసీసీఐకి ఆమె ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపింది. ఈ ప్రయాణం గురించి ఇండియా టుడేతో మాట్లాడుతూ.. ఒక దశలో ప్రొఫెషనల్ క్రికెటర్ అవ్వాలన్న కలను దాదాపు వదులుకున్నానని అనన్య తెలిపింది. కానీ, చుట్టూ ఉన్నవారి మద్దతు, స్వీయ విశ్వాసంతో తిరిగి నమ్మకాన్ని పుంజుకున్నట్లు చెప్పింది. "మహిళల క్రీడల పట్ల సమ్మిళితమైన, న్యాయబద్ధమైన, గౌరవప్రదమైన విధానాలను బీసీసీఐ రూపొందిస్తుందని ఆశిస్తున్నాను. ఏదో ఒక రోజు భారత్ తరఫున ప్రపంచకప్ గెలవాలన్నది నా కల. దేశం కోసం ఏదైనా సాధించాలనుకుంటున్నాను" అని అనన్య తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. తన ప్రయాణం ఎంత కఠినంగా సాగిందో వివరిస్తూ.. "ప్రజల నుంచే కాకుండా, కుటుంబ సభ్యుల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వచ్చింది. నాకు కనీస మద్దతు మాత్రమే లభించింది. ఈ ప్రయాణంలో నాకు పూర్తిస్థాయిలో అండగా నిలిచారన్న భావన కలగలేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. లింగమార్పిడి ప్రక్రియకు ముందు ఎదుర్కొన్న సవాళ్లను గుర్తుచేసుకుంది. "ఒకానొక దశలో బ్రతకడం కోసం యూకేలోని క్రికెట్ డ్రెస్సింగ్ రూమ్‌లలోనే కొన్ని నెలల పాటు తలదాచుకోవాల్సి వచ్చింది. దాదాపు 5 నెలలు అక్కడే గడిపాను. ఆ తర్వాత నా సర్జరీల కోసం నిధులు సమకూర్చుకోవాలని సోషల్ మీడియాలోకి వచ్చాను. కొన్ని బ్రాండ్ డీల్స్ ద్వారా వచ్చిన డబ్బుతో నా సర్జరీలు చేయించుకున్నాను" అని అనన్య వివరించింది. "నిజం చెప్పాలంటే ఇది చాలా ఒంటరి, కఠినమైన ప్రయాణం. కానీ ఈ ఏకాంతమే నన్ను ఎంతో ఆత్మవిశ్వాసంతో, బలంగా తయారుచేసింది" అని ఆమె పేర్కొంది.

## పలు వివాహ కార్యక్రమాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి...!

**- నూతన వధూవరులను ఆశీర్వదించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి**



**అనంతపురం – సూర్య వాస్తవం:** రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వివాహ కార్యక్రమాలకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వివాహ వేడుకలకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. కార్యక్రమం అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి



**కనేకల్ – సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ శ్రీ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షులు బోయ వనూర్ స్వామి , మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి , మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీ బోయి మల్లికార్జున్ , మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, జయరాం రెడ్డి, ఎంపీటీసీ కళ్లెం సురేష్ , సురేష్ యాదవ్, డాక్టర్ మల్లికార్జున్ , కసందుల కుమార్ , జకతి కృష్ణ, వాల్మీకి పవన్, ఎర్రగుంట శ్రీనివాస్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన గౌతమ్ కుమార్...!

**- బెంగళూరులో ఘనంగా జరిగిన జయవర్ధన్ రెడ్డి-శ్రావ్య రెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరు**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తనయుడు చి. జయవర్ధన్ రెడ్డి, చి.ల.సౌ. శ్రావ్య రెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమం బెంగళూరులోని వీరడెన్సీ రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉరవకొండ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి గౌతమ్ కుమార్ హాజరయ్యారు. వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన గౌతమ్ కుమార్, జయవర్ధన్ రెడ్డి--శ్రావ్య రెడ్డి దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పలువురు జనసేన నాయకులు, అభిమానులు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి



**కనేకల్ – సూర్య వాస్తవం :** కనేకల్ మండలం కనేకల్ టౌన్‌లోని కె.సి.ఎన్.ఆర్. ఫంక్షన్ హాల్లో, అలాగే ఎర్రగుంట, సొల్లాపురం, రచ్చుమర్రి గ్రామాల్లో జరిగిన పలు వివాహ కార్యక్రమాలకు రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త గౌరవనీయులు మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్‌తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా మైనార్టీలు పనిచేయాలి

**-ఏపీసిసి మైనార్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జాకీర్ హుస్సేన్**



**రాయచోటి-సూర్య వాస్తవం:** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో మైనార్టీలను ఏకం చేయడానికి వివిధ సమావేశాలు, ప్రచారాలు, పార్టీ యాక్టివిటీలను సమన్వయం చేస్తూ 2029 ఎన్నికల దిశగా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంలో చురుగ్గా పాల్గొంటున్న ఏపీసిసి మైనారిటీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జాకీర్ హుస్సేన్ రాయలసీమ పర్యటనలో భాగంగా రైల్వే గూడూరు, చిత్తూరులో జరిగిన పార్టీ సమావేశాలనుముగించుకుని ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని డిసిసి కార్యాలయానికి విచ్చేసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో, ముఖ్యంగా అత్యధిక మైనారిటీలు ఉన్న రాయలసీమలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఏం చేయాలిఎలాముందుకెళ్లాలి, ఆలోచించి ఒక ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయి నుంచి కమిటీల నిర్మాణం ఎలా చేపట్టాలి. అంతర్గత కలహాలైతేనేమి, అదే విధంగారా బోయేటటువంటి స్థానిక సంస్థల ఎన్నికలలో మన పాత్ర ఏంటి ఎలా ఉండాలి? ఓ పక్క టిడిపి, మరో పక్క వైఎస్ఆర్సిపి, వివిధ పార్టీలు చాలా ఉన్నాయి. వీటన్నిటిని అధిగమించ డానికి ఒక ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో మన స్థానం నిలబెట్టుకోవాలంటే గత వైభవాన్ని పూర్తిస్థాయి తీసుకురావాలంటే మనమేం చేయాలి ఎలా చేయాలి అనేటటువంటి విషయాలు చర్చించడానికి రాయచోటికి రావడం జరిగిందన్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ గురించి చారిత్రాత్మకంగా మీ అందరికీ తెలిసినటువంటి విషయమే. 2014 నుంచి జరుగుతున్నటువంటి



పరిమాణాలు మిత్రులకు తెలుసుఅన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల కోసం 2024

ఎన్నికల మేనిఫెస్టోలో

పెట్టినటువంటి పథకాలు, హామీలు కనీసం ఏదైనా పూర్తిస్థాయి అమలు చేశారా అంటూ ఆయన అడిరు. ఇక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి చెప్పాలంటే ఒక మత నాయకుడా, లేకపోతే ఒక సంఘానికి నాయకుడా, రాజకీయ నాయకుడా అర్థం కానటువంటి పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిందివి ఆయన చెప్పారు. రాజ్యపాలన చేస్తాను, అంటే ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఆయన ఒక మత గురువులా మాట్లాడటం , వ్యవహరించడం చాలా బాధాకరమైన విషయ మన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోబోతున్నాం కూటమి నాయకులు చేసినటువంటి ప్రతి ఒక్క అవినీతి అన్యాయం అక్రమాలను బయటకి తీయబోతున్నాం వాటిని కూడా మీరు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది అని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు, దూసుకుంటూ, దాచుకుంటుంటే దాన్ని పూర్తిస్థాయి బిజెపి ప్రభుత్వం సపోర్ట్ చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ ఆధ్వర్యంలో జాకీర్ హుస్సేన్, కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మహమ్మద్ యూసుఫ్, రాష్ట్ర మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ కే భాష,రాయచోటి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్ అమీర్, ఇర్షాద్, నౌషాద్, రియాజ్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి..

**- తాగునీటి సమస్యను పరిష్కరించాలి**
**- వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి**



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను నీటితో నింపి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివారం బ్రహ్మం సాగర్ ను కడప జిల్లా వైయస్సార్సీపి రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం బ్రహ్మనుసాగర్ ప్రాజెక్టు పైన ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు సాగునీరు అత్యంత కీలకమన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెంచి, పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని అన్నారు. రైతులు, ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో నీటిని అందించాలి.

సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించాలి.

పంటలకు అవసరమైన సమయంలో నీరు అందించి రైతులకు అండగా నిలవాలి.

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి.

వేసవితో పాటు అన్ని కాలాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. 3 రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలి.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు అన్నపురెడ్డి నారాయణరెడ్డి, జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షుడు నల్లపురెడ్డి ప్రశాంత్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పసుపులేటి వెంకటేష్, గొడ్లవీడు పంచాయతీ అధ్యక్షుడు పుల్లలచెరువు రమేష్‌రెడ్డి, గొడ్లవీడు రైతు అధ్యక్షుడు అబ్బిరెడ్డి, ఎర్రంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి, మండల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యేమిరెడ్డి నరసింహారెడ్డి, ఎల్లటూరు మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

# వెంకటాద్రిపల్లిలో మల్లేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం



**బేలుగుప్ప– సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా బేలుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి గ్రామంలో పురాతన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా నూతన ఆలయంలో శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి, శ్రీ గణపతి, శ్రీ నందీశ్వర, శ్రీ నాగదేవతల ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర శ్రావణ బహుళ విదియ సందర్భంగా తెల్లవారుజామున 4.15 గంటలకు కర్కాటక లగ్న శుభపుష్కరాంశమున యంత్రస్థాపన, శిఖర, విగ్రహ ప్రతిష్ఠలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్య ధ్వజ ప్రతిష్ఠ, బలిపీఠ స్థాపన తదితర కార్యక్రమాలు చేపట్టారు. ప్రాణ ప్రతిష్ఠ, కక్ష్య



జ్వాలా దర్శనం, కూష్మాండ బలి, దేవతా దర్శనం, పూర్ణాహుతి, కలశ మార్జనాలు, స్వస్తి వాచనాలు, శ్రేయోదానం, ఆశీర్వచనాలు, మంత్రపుష్పం అనంతరం మహామంగళ హారతి నిర్వహించారు. చివరగా భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఆర్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించిన మేరకు నిర్వహిస్తున్న ఈ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )